సాక్షి
నంద్యాల

శుక్రవారం । 31 । మే । 2024



నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యకళారాధన వేదికపై గుంటూరుకు చెందిన టి. నాగశ్రీ ప్రవల్లిక బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం గురువారం భక్తులతో పోటెత్తింది. స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.



అన్నదానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి గురువారం గుంటూరుకు చెందిన డి.శివగంగారెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పాలిసెట్ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో నాలుగో రోజు గురువారం 43 వేల నుంచి 59 వేల ర్యాంక్ సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించే విద్యార్థుల అర్హత పత్రాలను బీసీ సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమాధికారులు పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన జూన్ 3వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రత్యేక కేటగిరీ, రిజర్వేషన్, ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్, గేమ్స్, పీడబ్ల్యూడీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పరిశీలిస్తున్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 27 కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం జీవశాస్త్రం పరీక్షకు 5,065 మంది విద్యార్థులకు గాను 2,726 మంది హాజరైనట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. ఉదయం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి సంవత్సరం 4,514 మంది విద్యార్థులకు గాను 4,250 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 204 మందికి గాను 176 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం సప్లిమెంటరీ కెమిస్ట్రీ, కామర్స్, ఫైన్ ఆర్ట్స్ మ్యూజిక్ పరీక్షలకు 1,240 మందికి గాను 1161 మంది హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ పరీక్షకు 36 మందికి గాను 27 మంది హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి సునీత తెలిపారు.

రేపు హనుమాన్ జయంతి



హనుమాన్ విగ్రహం

శ్రీశైలంటెంపుల్: వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని జూన్ 1న శనివారం శ్రీశైలంలోని పాతాళ గంగ మార్గంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 8.30 గంటలకు వేదపండితులు, అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా జయంత్యోత్సవ సంకల్పాన్ని పఠిస్తారన్నారు. అనంతరం మహాగణపతిపూజ ఉంటుందని తెలిపారు. ఆంజనేయస్వామివారికి శ్రీమన్యుసూక్త పారాయణ సహిత అభిషేకం, నాగవల్లి దళార్చన, పుష్పార్చన నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

1 నుంచి 'ఓపెన్' పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ విడుదల చేసిందన్నారు. అభ్యర్థులు https://apopenschool. ap.gov.in వెబ్ పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసకోవచ్చన్నారు. జిల్లాలో పదో తరగతి నాలుగు సెంటర్లు, ఇంటర్ మూడు సెంటర్లలో పరీక్షలు జరుగనున్నాయన్నారు.

హుండీ ఆదాయం రూ. 66.46లక్షలు



మహానంది: హుండీ కానుకల ద్వారా మహానందీశ్వరుడికి 65 రోజులకు రూ. 66,46,755 ఆదాయం వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించినట్లు చెప్పారు. అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 94,915, గోసంరక్షణ విభాగం ద్వారా రూ. 35,644 వచ్చినట్లు తెలిపారు. నేపాల్, యూఎస్ఏ, యూఏఈ దేశాల కరెన్సీ వచ్చిందన్నారు. ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శశిధర్ రెడ్డి, నీలకంఠరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సీబీఎస్‌ఈ పాఠాలు

- ఈ విద్యా సంవత్సరం 69 పాఠశాలల్లో బోధన
- త్వరలో రానున్న పాఠ్య పుస్తకాలు
- విద్యార్థులకు ఎంతో ప్రయోజనం
- జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం



సీబీఎస్‌ఈ సిలబస్‌కు ఎంపికైన కోవెలకుంట్ల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల

నంద్యాల(న్యూటౌన్)/కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గత విద్యాసంవత్సరంలో సీబీఎస్‌ఈ సిలబస్‌లో 8, 9 తరగతులు చదివిన విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో 9, 10 తరగతులకు వెళ్లనున్నారు. అలాగే 7వతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 8వ తరగతిలోకి ప్రవేశించనున్నారు. ఈఏడాది 10వ తరగతి తొలి బ్యాచ్ విద్యార్థులు సీబీఎస్‌ఈ సిలబస్‌కు సిద్ధం కానున్నారు. నంద్యాల జిల్లాలో తొలి విడతలో 69 పాఠశాలలు ఎంపిక చేశారు. బట్టీ విధానానికి, మూస పద్ధతికి స్వస్తి పలికి సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేయనున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవలే 754 మంది ఉపాధ్యాయులకు ఇంగ్లిషు, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు త్వరలోనే పాఠ్య పుస్తకాలు అందజేయనున్నారు.

విద్యార్థులకు భారం లేకుండా..

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్‌ఈ సిలబస్ విధానం అమలవుతోంది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్‌ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. ఈ సిలబస్ ఉన్న పాఠశాలల్లో బోధన అత్యాధునికంగా ఉంటుంది. జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఉపయోగకరంగా ఉంటుంది. సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయాలంటే సంబంధిత విద్యా సంస్థ సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌లో అఫ్లియేషన్ పొందాల్సి ఉంటుంది. అఫ్లియేషన్, రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజుల కోసం ఒక్కొక్క పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.లక్ష రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 69 పాఠశాలలకు రూ.69 లక్షలు ప్రభుత్వమే గత విద్యా సంవత్సరంలో చెల్లించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుతుండటంతో విద్యార్థులపై భారం పడకుండా ప్రభుత్వమే ఆర్థిక భారాన్ని భరించింది.

ప్రయోజనాలు ఇవీ..

- విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. కోర్సు నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు. పుస్తకాలు ఆసక్తిగా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూపొందిస్తారు.
- పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు దోహదపడతాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటాయి. వాస్తవాలకు దగ్గరగా విద్యను బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతానికి పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. ఏ మేరకు సబ్జెక్టు నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు. ఫలితాలు అనుకూలంగా వస్తాయి.
- ఐఐటీ, ఎయిమ్స్ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు కొనసాగించాలనుకుంటే సీబీఎస్‌ఈ పాఠ్యాంశాలు చాలా సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్‌ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు.

ఉజ్వల భవిష్యత్తు

చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత సొంతమవుతుందని, వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. అందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో సంస్కరణలు చేపట్టింది. నాడు– నేడు కింద పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధించే సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది.

జిల్లాలో ఈఏడాది పదో తరగతిలో సీబీఎస్‌ఈ బోధన జరిగే పాఠశాలల వివరాలు

పాఠశాల యాజమాన్యం	సంఖ్య
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	08
ఏపీ మోడల్ స్కూల్స్	19
కేజీబీవీ స్కూల్స్	27
ఏపీ గురుకుల పాఠశాలలు	08
బీసీ వెల్ఫేర్ స్కూల్స్	02
మున్సిపల్ హైస్కూల్స్	05

విద్యార్థులకు ఉపయోగకరం



పోటీ ప్రపంచంలో విద్యార్థులు సామర్థ్యాలు పెంచుకునేందుకు సీబీఎస్‌ఈ సిలబస్ బాగా ఉపయోగకరంగా ఉంటుంది. ఆధునాతన పద్ధతిలో బోధన ఉంటుంది. ఈసిలబస్‌తో ఇంటర్ పూర్తి చేసుకున్నాక జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు రాసి విద్యార్థులు ప్రతిభ చూపవచ్చు. ఈ విద్యాసంవత్సరం నుంచే బోధన ప్రారంభం కానుండటంతో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్‌ను అందుబాటులోకి తేవడం స్వాగతించదగ్గ అంశం. ప్రభుత్వ నిర్ణయం భేష్. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు రాణించేందుకు అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు కృషి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

–లింగన్న, సాంబవరం, గోస్పాడు మండలం

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు



స్ట్రాంగ్‌రూమ్స్‌లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: కౌంటింగ్ కేంద్రాల్లో కట్టుదిట్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదేశించారు. పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. వచ్చే నెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. తొలుత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి కౌంటింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌ను పరిశీలించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరూ కౌంటింగ్ సెంటర్ల వద్దకు అనుమతించవద్దని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

పటిష్ట భద్రత

- కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

బొమ్మలసత్రం: కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై, తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి పోలీస్ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకుడదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్దకు ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మాత్రమే వచ్చేలా చూడాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్ తీసుకురాకూడదని, ఏజెంట్లు ఒక్కసారి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బయటకు వెళ్లడానికి వీలు లేదన్నారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్స్, నేరచరిత్ర గల వారిపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి వీలులేదన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఓ. ప్రవీణ్ కుమార్, డీఎస్పీలు జీవీ సంతోష్, శ్రీనివాసరెడ్డి, రవీంద్ర నాథ్ రెడ్డి, షర్ఫుద్దీన్, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈసెట్) ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఫార్మసీ స్ట్రీమ్‌లో జిల్లాకు చెందిన షేక్ ముస్కాన్, షేక్ దిల్షాద్ అనే విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో 7, 10వ ర్యాంకులు సాధించారు. జెఎన్‌టీయూ అనంతపురం వారు నిర్వహించిన ఈ పరీక్షలకు కర్నూలు జిల్లాలో నాలుగు, నంద్యాల జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో జరిగిన పరీక్షలకు కర్నూలు జిల్లా నుంచి 1244 మంది విద్యార్థులురిజిస్టర్ చేసుకోగా, 1212 మంది పరీక్ష రాయగా.. వీరిలో 1,078 మంది అర్హత పొందారు. నంద్యాల జిల్లా నుంచి 832 మంది పరీక్షలకు రిజిస్టర్ చేసుకోగా 832 మంది పరీక్షలు రాయగా, 760 మంది అర్హత పొందారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కావాలని ఉంది



మాది కర్నూలు నగరంలోని బుధవారపేట. మా తల్లిదండ్రులు షేక్ షీఖకతుల్లా షరీఫ్, సిరాజ్ ఉన్నీషా. మేము నలుగురు సంతానం. నేను రెండో సంతానం. ఉద్యోగ, ఉపాధి అవకాశలు ఎక్కువగా ఉంటాయనే ఫార్మసీ వైపు వచ్చాను. కర్నూలు నగర శివారులోని ఎస్‌జిపిఆర్ ప్రభుత్వ పాలీటెక్నిక్ కాలేజీలో చదివాను. ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఎంఫార్మసీ పూర్తి చేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. – షేక్ ముస్కాన్

మా కోసం అమ్మ చాలా కష్టపడుతున్నారు



మా నాన్న ఎస్.బాబా ఫకృద్దీన్ నా చిన్నతనంలోనే చనిపోయారు. అప్పటి నుంచి మా అమ్మ షేక్ షంషద్‌బీ మా చదువు కోసం కష్టపడి పడుతున్నారు. బి.తాండ్రపాడు గ్రామంలో కొందరు పెద్దల సహకారంతో ఎస్.జి.పి.ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చదివాను. ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు రావడం చాలా సంతోషం. ఫార్మసీ విభాగంలో లెక్చరర్‌గా పని చేయాలని ఉంది. – షేక్ దిల్షాద్

బ్యాంకుల నుంచే పింఛన్లు

కర్నూలు(అగ్రికల్చర్): అవ్వతాతలు, ఇతర పింఛనుదారులు జూన్ నెల పెన్షన్ పొందాలంటే మరోసారి బ్యాంకుల మెట్లు ఎక్కాల్సిందే. చంద్రబాబు ముఠా కుట్ర ఫలితంగా పింఛనుదారులు ఏప్రిల్ నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛనుదారులు దాదాపు ఐదేళ్ల పాటు ఇంటి వద్దే సేవలు పొందుతున్నారు. చంద్రబాబు గ్యాంగ్ కారణంగా మొదటిసారి గత ఏప్రిల్ నెలలో సచివాలయాల మెట్లు ఎక్కారు. అవ్వతాతలను అప్పటికీ పచ్చ తమ్ముళ్లు మే నెల పింఛన్ల పంపిణీలో మరో కుట్రకు తెరతీశారు. ఫలితంగా మే నెల పింఛన్లు పొందేందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు చుక్కలు చూడాల్సి వచ్చింది. జూన్ నెల పింఛన్ల విషయంలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. మొత్తం పింఛన్లలో 25 శాతం డోర్ టు డోర్ పంపిణీ చేస్తుండగా.. 75 శాతం పింఛనుదారులకు సంబంధించి నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం గురువారం నిధులు విడుదల చేసింది.

- కర్నూలు జిల్లాలో ఇంటింటికి వెళ్లి 61,583 పింఛన్లు పంపిణీ చేస్తారు. వీటికి రూ.18,77,08,000 విడుదలయ్యాయి.
- నంద్యాల జిల్లాలో డోర్ టు డోర్ పింఛన్లు 53,765 ఉండగా.. ఇందుకు రూ.15,67,95,500 విడుదలయ్యాయి.
- శనివారం ఉదయం నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు.
- డీబీటీ ద్వారా కర్నూలు జిల్లాలో 1,84,765 పింఛన్లు, నంద్యాల జిల్లాలో 1,68,640 పింఛన్లకు నగదు బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.

మున్సిపల్ ఉద్యోగులపై కేసు నమోదు?

డోన్ టౌన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో డోన్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అవినీతికి బాధ్యులుగా 14 మంది ఉద్యోగులపై కేసు నమోదు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు గురువారం రాత్రి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం, డీజిల్ కొనుగోలులో రూ.24 లక్షల వరకు అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విచారణలో బాధ్యులను గుర్తించి పేర్లు వివరిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 1వ వార్డు కౌన్సిలరు కొట్రికె ఫణిరాజ్ ఆయన భార్య గాయిత్రీ దేవి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టి రూ. 24 లక్షల మేరకు అక్రమాలు జరిగినట్లు గుర్తంచారు.

మహాయోగి.. మనసాస్మరామి!

శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ వెండి రథోత్సవం ఆదోని పట్టణంలో గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా ఆలయంలో అవ్వ మూలవిరాట్‌ను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనం అనంతరం అవ్వ బంగారు ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుంచి వేడుకను ప్రారంభించారు. ఆదోని పట్టణ వీధుల్లో రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

– ఆదోని అర్బన్





రథోత్సవంలో పాల్గొన్న భక్తులు.(ఇన్‌సెట్‌లో) అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ మూలవిరాట్

క్లుప్తంగా

పెళ్లి పేరుతో మోసం

● యువకుడి కుటుంబంపై కేసు నమోదు

బనగానపల్లె రూరల్: పెళ్లి పేరుతో మోసం చేసిన ఓ యువకుడి కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. పలుకూరు గ్రామానికి చెందిన యువతికి, అవుకు మండలం మంగంపేట గ్రామానికి చెందిన రంగి చిన్న మద్దిలేటి కుమారుడు మధుతో రెండు నెలల పెద్దల నిర్ణయం మేరకు క్రితం పెళ్లి నిశ్చయమైంది. గత ఏప్రిల్ 18, 19వ తేదీల్లో వారికి వివాహం చేయాలని పెళ్లి పత్రికలు కూడా బంధువులందరికీ పంపిణీ చేశారు. అయితే వివాహ తేదీకి ఒక రోజు ముందు మధు ఇంట్లో నుంచి వెళ్లిపోయి కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన మరో యువతిని వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి న్యాయం చేస్తామని చిన్న మద్దిలేటి నచ్చచెబుతూ వచ్చి చివరకు మోసం చేశాడు. ఈ మేరకు మధుతో పాటు అతని తల్లిదండ్రులు, మరో ఇద్దరు వ్యక్తులపై యువతి తండ్రి గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

ఉయ్యాలవాడ: మద్యం సేవిస్తూ వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులకు కోవెలకుంట్ల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు అబ్దుల్ రెహమాన్ జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన బోడెమ్మనూరుకు చెందిన చిన్నబాదుల్లాకు రూ.2 వేల జరిమానాతో పాటు 15 రోజుల జైలుశిక్ష, అలాగే ఆర్.జంబులదిన్నె గ్రా మానికి చెందిన గగ్గెర క్రిష్ణయ్య, సంజామల మండ లం ఆకుమల్లకు చెందిన వెంకటరమణ, వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామానికి చెందిన బాలగైబులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

వ్యసనానికి ప్యాచ్ వేసేద్దాం

● పలు వ్యాధులకు కారణం పొగాకు వినియోగం
● జీర్ణకోశ, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు క్యాన్సర్
● గుండె, మెదడుకు మరింత చేటు
● పెద్దాసుపత్రిలో డీ–అడిక్షన్ సెంటర్
● వ్యసనం మాన్పించేందుకు ఉచితంగా నికోటిన్ ప్యాచెస్
● నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

పొగాకు తాగని వాడు దున్నపోతై పుట్టున్.... ఈ డైలాగ్ అదో పాత సినిమాలో పాత్రలచే చెప్పించారు. ఆ పాత్రకు అవసరమైంది కాబట్టి అప్పట్లో అలా చెప్పారు. కానీ పొగాకు జోలికి వెళితే మాత్రం శరీరం గుల్ల అవడం మాత్రం ఖాయం. దాన్ని వాడితే కొన్ని నిమిషాల పాటు హుషారుగా ఉంటుందేమో గానీ ఆ తర్వాత అది శరీరంలోకి వెళ్లి ఒక్కో అవయవాన్ని దెబ్బ తీస్తుంది. క్రమంగా ప్రాణాంతక వ్యాధులకు కారణం అవుతుంది. పొగాకు వాడకంపై అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నారు.



కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, క్యాన్సర్ వంటి బాధితులను చూసేవాళ్లం. కానీ ఇప్పుడు దురలవాట్ల పుణ్యమా అని యువతకు కూడా ఈ వ్యాధులు అంటుకుంటున్నాయి. అందులో ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తులు వాడటం. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ ఈ జబ్బులతో యువకులు అధిక సంఖ్యలో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతుండటం ఈ పరిస్థితికి నిదర్శనం. జిల్లాలో క్యాన్సర్ వైద్యులు, న్యూరాలజిస్టులు, కార్డియాలజిస్టులు, జనరల్ పిజీషియన్ల వద్దకు ప్రతిరోజూ ఇలాంటి బాధితులు 1,500 నుంచి 2 వేల మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. వీరికి వచ్చే వ్యాధులకు ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తులు వాడటమేనని వైద్యులు చెబుతున్నా వారిలో మార్పు రావడం లేదు. పొగాకు అన్ని రకాలుగా ప్రమాదకరమే. పొగాకు ఉత్పతులన్నీ నోరు, గొంతు, అన్న వాహిక, కడుపు, ఊపిరితిత్తులు, మూత్రవ్యవస్థలపై ప్రభావాన్ని చూపుతాయి. పొగాకులో పాలిసైక్లిన్ ఆటోమేటిక్ హైడ్రో కార్బైడ్స్, నైట్రోజీన్ అమైన్స్, ఆటోమేటిక్ అమైన్స్ వంటి క్యాన్సర్ కారకాలు, కాడ్మియం, క్రోమియం, ఇథిలిన్ ఆక్సైడ్, ఆర్సానిక్ వంటి దాదాపు 72 రకాల క్యాన్సర్ కారకాలైన రసాయనాలు ఉంటాయి. ధూమపానం వల్ల ఈ క్యాన్సర్ కారకాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలో ప్రవేశించి శరీరమంతా వ్యాపిస్తాయి. ఇదే గాకుండా జన్యుపరమైన మార్పులను కలుగజేస్తుందని సైన్స్ నిరూపితం చేసింది.

పొగాకు మానితే ప్రయోజనాలు

- గుండెజబ్బులు, క్యాన్సర్, రక్తపోటుకు దూరంగా ఉండవచ్చు.
- రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- రుచి, వాసన, గ్రహణశక్తి మెరుగుపడుతుంది
- త్వరగా అలసటకు గురిగాకుండా ఉంటారు. ఆయుష్షు పెరుగుతుంది.



పొగాకుకు బానిసైన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

పొగాకు మానేందుకు డీ అడిక్షన్ సెంటర్

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2021 జనవరిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రిక్ విభాగంలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు ఉన్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సెలింగ్, బిహేవియర్ థెరపి చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్ అందజేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 360 మందికి ఈ ప్యాచెస్ అందజేశారు. ప్రతి నెలా 250 మంది దాకా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నికోటిన్ ప్యాచెస్ అతికించడం వల్ల పొగ తాగాలి, పొగాకు నమలాలి అనే ఆలోచనను తగ్గిస్తుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడతాయి.

పొగాకు వాడకాన్ని ఇలా మానుకోవాలి



- పొగాకును ఒకేసారి మానకుండా రోజురోజుకు వాడకం తగ్గించుకుంటూ రావాలి.
- పొగాకు మానడానికి కాగితంపై తేదీ నిర్ణయించుకుని దానిని ఒకచోట అతికించాలి. కుటుంబసభ్యులకు ఆ తేదీని చెప్పి వారిని సహకరించాలని కోరాలి.
- నికోటిన్ మాత్రలు, ప్యాచెస్ వాడవచ్చు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకం



పొగాకు ఉత్పత్తులు వాడే వారికి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్ బాధితులు అధిక సంఖ్యలో పెరుగుతున్నారు. బీడి, సిగరెట్ తాగే వారిలో చేతులు, కాళ్లలోని నరాలు మూసుకుపోతున్నాయి. ఫలితంగా కాళ్లు, చేతుల్లో రక్తప్రసారం తగ్గిపోయి నల్లగా మారిపోయి తీవ్ర నొప్పిని కలుగజేస్తున్నాయి. గ్యాంగ్రిన్‌గా మారిన కాలు, చేతిని తప్పనిసరి పరిస్థితిలో తీసేయాల్సి వస్తోంది.

– డాక్టర్ సి.వాసురెడ్డి, క్యాన్సర్ వైద్యనిపుణులు, కర్నూలు

గుండెపోటుకు దారితీస్తుంది



ధూమపానం కారణంగా రక్తనాళాల అథెరోస్కెరోసిస్ ప్రమాదం పొంచి ఉంది. పొగ తాగడం వల్ల కరోనరి ఆర్టరి డిసీజ్, గుండెపోటు, పక్షవాతం తదితర వ్యాధులు వస్తాయి. శ్వాసకోశంలో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, క్రానిక్ బ్రాంకైటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వ్యంధత్వానికి (సంతానలేమి) దారి తీసే కారణాల్లో ధూమపానం ఒకటి. మగవారిలో వీర్యకణాల సంఖ్య తగ్గడం వల్ల నపుంసకత్వానికి దారి తీస్తుంది. గర్భిణిల్లో గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంది. గర్భిణిలకు అకాల ప్రసవాలు, శిశు అనారోగ్యాలకు దారి తీస్తోంది.

– డాక్టర్ చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతిచెందిన ముత్తమ్మ (ఫైల్)

ఆదోని అర్బన్: పెద్దతుంబళం గ్రామ సమీపంలో గురువారం రాత్రి రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. కౌతాళం మండలం చూడి గ్రామానికి చెందిన ముత్తమ్మ (54) చిన్నతుంబళంలో వివాహం కార్యక్రమం చూసుకుని, సాయంత్రం ఓ ఆటోలో తిరుగు ప్రయాణమైంది. పెద్దతుంబళం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరొక ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముత్తమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముత్తమ్మ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి భర్త నరసప్ప కొన్నేళ్ల క్రితం మృతి చెందగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య



సాయినాథ్ (ఫైల్)

ప్యాపిలి: పట్టణంలోని బెస్త వీధిలో నివాసం ఉంటున్న నడిగడ్డ సాయినాథ్ (42) చెట్టుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గురువారం సాయంత్రం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత మూడు నెలలుగా మతిస్థిమితం లేని సాయినాథ్ ఈ నెల 22వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. గురువారం పట్టణ సమీపంలోని వానకొండకు వెళ్లిన పశువుల కాపర్లు...గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అ మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డును పరిశీలించిన పోలీసులు వెంటనే సాయినాథ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి సాయినాథ్‌గా కుటుంబ సభ్యులు కూడా నిర్ధారించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన రోజే సాయినాథ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ - లైబ్రరీలుగా మార్పునకు చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి ప్రకాశ్

ప్యాపిలి: ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో కంప్యూటర్‌లు ఏర్పాటు చేసి ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించి ఈ – లైబ్రరీలుగా మార్పు చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కాటన్ ప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని స్థానిక శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 60 గ్రంథాలయాలు ఉండగా పదింటిలో ఇప్పటికే కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించామన్నారు. వీటి ద్వారా పాఠకులకు ఆన్‌లైన్ ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. మిగిలిన అన్ని గ్రంథాలయాల్లో కూడా ఈ సౌకర్యం కల్పించేందుకు రూ. 20 లక్షలు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల 10 గ్రంథాలయాలకు కొత్త భవనాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. నంద్యాల జిల్లాలో మూడు గ్రంథాలయాలు మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. శిరివెళ్ల, డోన్‌లో అనువైన స్థలం లభించగానే కొత్త భవనాల నిర్మాణం చేపడతామన్నారు. జిల్లాలో 35 గ్రంథాలయాలకు రెగ్యులర్ లైబ్రేరియన్లు, 25 గ్రంథాలయాలకు ఔట్‌సోర్సింగ్ లైబ్రేరియన్లు ఉన్నట్లు తెలిపారు. ప్యాపిలి లైబ్రరీకి గ్రిల్ ఏర్పాటు చేయడంతో పాటు కొత్త మోటర్ మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని లైబ్రేరియన్ పద్మావతిని ఆయన ఆదేశించారు.

మద్యం అక్రమ విక్రయదారుడికి జైలుశిక్ష, జరిమానా

డోర్నిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన వెంకటప్రసాద్ అక్రమంగా మద్యం విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ చేపటిన కోవెలకుంట్ల సివిల్ కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.2 లక్షల నగదు జరిమానా విధించారు. ఏపీపీ వసంతలక్ష్మి కేసును వాదించారు. అక్రమంగా మంద్యం విక్రయిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన మహిళ

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతురాలి వయస్సు సుమారు 40ఏళ్లకు పైగా ఉంటుందని, ఆకుపచ్చని చీర, అంచుతో ఉన్న జాకెట్ ధరించింది. విషయం తెలుసుకున్న నంద్యాల రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అంత్యక్రియలు చేశారు. ఎక్కడి నుంచి వచ్చింది, ఎలా చనిపోయిందని వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

● గట్టి ఎద్దు.. చిట్టి ప్రేమ



ఈ చిత్రంలో ఎద్దు వద్ద ఏడుస్తున్న చిన్నారి పేరు మహమ్మద్. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన మిట్టమీది హిమాంసాహెబ్ కుమారుడైన ఈ చిన్నారి.. ప్రతి రోజు ఎద్దుకు మేత వేయడం, నీళ్లు తాపడం వంటి పనులు చేస్తూ మమకారం పెంచుకున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం తండ్రి ఎద్దును అమ్మడంతో గురువారం దానిని తీసుకెళ్తున్న క్షణంలో ఈ చిన్నారి కన్నీటి పర్యంతమయ్యాడు. –వెల్దుర్తి(కృష్ణగిరి)

భవిత కేంద్రాల సేవలపై అవగాహన



ప్రత్యేక అవసరాలుగల బాలల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించడం వల్ల వారికి వివిధ రకాల అలవెన్సులు, ఉచిత ఉపకరణాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కూడా అందుతాయని చెప్పారు. బోధనకు టీఎల్‌ఎం కిట్లతో పాటు పిల్లల వెంట భవిత కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రులకు ప్రయాణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. సర్వే నిర్వహిస్తున్న సహిత విద్యా రిసోర్స్ సిబ్బంది తల్లిదండ్రులకు ఈ విషయాలను వివరించి బడిలో చేర్పించేందుకు వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని వచ్చేనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 29 మండలాలలో 450 మంది అర్హులైన బాలలను గుర్తించినట్లు తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



కర్నూలు కొత్త బస్టాండు ప్రాంతంలో విత్తన దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మితో సహా పలువురు వ్యవసాయ అధికారులు గురువారం కర్నూలులోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కొత్తబస్టాండు ప్రాంతంలోని మహాలక్ష్మి సీడ్, రాయలసీమ సీడ్ కార్పొరేషన్, ఇండియన్ సీడ్స్ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్లు ఎంఆర్‌పీకి విక్రయిస్తున్నారా? లేదా? అని విచారణ చేపట్టారు. కర్నూలు సబ్ డివిజన్‌లో 126 హెచ్‌టీ పరీక్షలు నిర్వహించాలనేది లక్ష్యం కాగా మూడు షాపుల్లో అక్కడికక్కడే ఐదు హెచ్‌టీ పరీక్షలు నిర్వహించగా మొత్తం నెగిటివ్ రిపోర్టు వచ్చింది. పత్తి విత్తన ప్యాకెట్ల శ్యాంపుల్స్ కూడా తీశారు. మహాలక్ష్మి సీడ్స్‌లో ఫామ్–3లో ఇంక్లూజన్ లేకుండా కూరగాయల విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఫామ్–3లో నమోదు లేకుండా కూరగాయల విత్తనాలు అమ్ముతుండటంతో మొత్తం స్టాక్‌పై స్టాప్ సేల్స్ ఇచ్చారు. ఫామ్–3లో ఇంక్లూజన్ లేకుండా ఎలాంటి విత్తనాలను అమ్మరాదని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. బీటీ–2 పత్తి విత్తనాలను ఎంఆర్‌పీకే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి, సాంకేతిక ఏవో దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



కుప్పగల్లు అడివప్ప (ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగి గ్రామ శివారులోని డి.బెళగల్ రోడ్డులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దొడ్డి గ్రామానికి చెందిన కుప్పగల్లు అడివప్ప (50) ప్రతి రోజూ కోసిగికు వెళ్లి కూలీ పనులు చేసుకుని రాత్రికి ఇంటికి చేరుకునేవాడు. యథావిధిగా బుధవారం ఉదయం బైక్‌పై కోసిగిలో ఉరుకుందప్ప అనే వ్యక్తి దగ్గర కూలీ పనులకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో డి.బెళగల్ రోడ్డులో రక్తపు గాయాలతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కాగా శరీరమంతా గాయాలు ఉండటంతో కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో యువకుడి మృత్యువాత



రవీంద్ర (ఫైల్)

సి.బెళగల్: కంబదహాల్ గ్రామానికి చెందిన వీరస్వామి, జయమ్మ దంపతుల మొదటి కుమారుడు రవీంద్ర (18) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రవీంద్ర ఇంటర్‌మీడియెట్ పూర్తి చేసి స్థానిక ప్రైవేట్ మందుల దుకాణంలో పని చేస్తున్నాడు. గురువారం రవీంద్ర తమ పొలానికి పశువుల ఎరువును ట్రాక్టర్‌లో తీసుకెళ్లి ఆన్‌లోడ్ చేసేందుకు ట్రాలీ లిఫ్ట్ పైకెత్తాడు. కాగా ట్రాలీలో ఎరువు కిందకు పడకపోవడంతో గడ్డపారతో ఎరువును తొలగించేందుకు ప్రయత్నించగా, అప్పటికే ట్రాలీకి పైనున్న విద్యుత్ తీగలు తాకడంతో రవీంద్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ సుకుమార్ సిబ్బంది అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కాగా చేతికొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

రేపటి నుంచి దక్షిణభారత మానసిక వైద్యుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ బాబు,చిత్రంలో మానసిక వైద్యులు

కర్నూలు (హాస్పిటల్): నగరంలో జూన్ 1, 2 తేదీల్లో దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.రమేష్ బాబు, సెక్రటరీ డాక్టర్ కె.నాగిరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి స్థానిక మౌర్యా ఇన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్, సౌత్ జోన్ విభాగాల సహకారంతో కర్నూలు సైకియాట్రిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక మౌర్యా ఇన్ హోటల్‌లోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సదస్సుకు దేశంలోనే గొప్ప వైద్య విద్యాసంస్థలైన నిమ్హాన్స్ (బెంగుళూరు), సీఎంసీ (వెల్లూరు), ఎయిమ్స్ (విజయవాడ), ఆంధ్ర మెడికల్ కాలేజ్ (వైజాగ్) తదితర ప్రాంతాల నుంచి ప్రముఖ వైద్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సైకోసొమాటిక్ వ్యాధులను ఎలా గుర్తించాలి, వివిధ రకాలైన వైద్యనిపుణులతో కలసి చర్చించి మంచి వైద్యం ఎలా అందించాలి అనే విషయాలను చర్చిస్తామన్నారు. దీంతో పాటు వివిధ రకాలైన దీర్ఘకాలిక మానసిక ఒత్తిడుల వలన మన శరీరంలోని హార్మోన్లపై, నాడీ వ్యవస్థపై, రోగ నిరోధక శక్తిపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. దాని వలన బీపీ, షుగర్, ఆస్తమా, పలు రకాల తలనొప్పులు, చర్మ వ్యాధులు, కడుపులో అల్సర్ లాంటివి రావడం, అంటు వ్యాధుల తీవ్రత పెరగడం జరుగుతుందన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ సుకృత్ రెడ్డి, మానసిక వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ యతిరాజు, డాక్టర్ చైతన్య, డాక్టర్ గంగాధర్ నాయక్ పాల్గొన్నారు.

ఖనిజ అక్రమ నిల్వలపై దాడి



అక్రమంగా నిల్వ ఉంచిన బరైట్ ఖనిజం

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామంలో అక్రమ ఖనిజ నిల్వలపై దాడి చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ తెలిపారు. అక్రమంగా బరైట్ ఖనిజాన్ని భారీగా నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ చిన్నమల్కాపురంలో నివాసం ఉంటున్న ప్రసాద్ అనే వ్యక్తి బరైట్ ఖనిజాన్ని అక్రమ తవ్వకందారుల నుంచి సేకరించి గ్రామంలోని ఓ షెడ్డులో నిల్వ ఉంచి, కూలీల సహాయంతో నీటిలో కడిగి శుద్ధిచేశారన్నారు. ఆ తర్వాత అక్రమంగా బనగానపల్లె, జమ్ములమడుగు మీదుగా కడపకు తరలిస్తున్నాడని విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు రూ.50 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.